సామరస్యంగా సమస్యను పరిష్కారం చేసుకోవాలి

– ఎంపీ అరవింద్

రెంజల్ ప్రజా జ్యోతి మార్చ్ 22 : హిందు వాహిని ధ్వజస్తంభం, గద్ద ఏర్పాటుపై సామరస్యంగా సమస్యను పరిష్కారం చేసుకోవాలి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ అన్నారు. శుక్రవారం రెంజల్ మండలంలోని నీల గ్రామాన్ని ఎంపీ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్నటువంటి హిందూ వాహిని ధ్వజస్తంభం ఏర్పాటుపై స్థానిక వైస్ ఎంపీపీ యోగేష్ సమస్యను తెలుపగా దానిని సామరస్యంగా పరిష్కారం చేసుకొని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామంలోని ముదిరాజ్ కమ్యూనిటీ, యాదవ కమ్యూనిటీ మరియు ఇతర కులాల సంఘ సభ్యులు ఎంపీకి కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని ఇంటి పత్రాలు అందజేశారు. నీళ్ల గ్రామానికి చెందిన రామాలయం భూముల 70 ఎకరాలకు పైగా వాటిని మహారాష్ట్రలో ఉన్న భూములను ఆలయానికి అప్పజెప్పే విషయంలో త్వరగా సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. ఆయన వెంట భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, జెడ్పిటిసి మేక విజయ, ఎంపీపీ లోలపు రజిని, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్ మండల అధ్యక్షుడు గోపికృష్ణ, జిల్లా, మండలంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చట్టాలపై స్క్రీన్ ద్వారా అవగాహన కళాజాత

రెంజల్ ప్రజా జ్యోతి మార్చ్ 22 : నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలపై అరికట్టేందుకై చట్టాలపై అవగాహన కలిపేందుకు స్క్రీన్ ద్వారా తెలపడం జరిగిందని బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం రెంజల్ మండలంలోని వీరన్న గుట్ట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బేటి పడావో-బేటి బచావో కార్యక్రమంలోని భాగంగా, మహిళలకు చిన్నారులకు కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన కలిపేందుకు స్క్రీన్ కళాజాత కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు పై జరుగుతున్న అరాచకాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలను తీసుకురావడం జరిగిందని వాటిని వినియోగించుకోవాలన్నారు. 1098,100,181,122 మరియు ఇతర టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలిపితే ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, మహిళలపై అత్యాచారాలు ఇటువంటి వాటిని ప్రజలకు తెలిపేందుకే కళాజాత ద్వారా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కౌన్సిలర్స్ జమున, స్వప్న, జోష్ణ, పుష్ప, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుందలో జోరుగా ఆన్లైన్ బెట్టింగ్

బిచ్కుంద మార్చ్ 22 (ప్రజా జ్యోతి) కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో ఐపీఎల్ మ్యాచ్‌లను చిన్నా.పెద్దా తేడా లేకుండా అందరూ వీక్షిస్తున్నారు. ఫలితం తేలే వరకు టీవీలు, స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ తరుణంలోనే జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అమాయకులు సొమ్ముకు ఆశపడి పందేలు కాస్తున్నారు. బెట్టింగ్ మాఫియా వలలో సులువుగా చిక్కుకుంటున్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ గెలవడం నుంచి బాల్ బై బాల్, ఓవర్ బై ఓవర్ అంటూ తుది విజేత తెలిసే వరకు వివిధ రకాలుగా బెట్టింగ్‌కు దిగుతున్నారు. దీనికితోడు సెల్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చిన క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా మరికొందరు యథేచ్ఛగా జూదాలకు పాల్పడుతున్నారు. సులువైన సంపాదనే లక్ష్యంగా పందేలకు అలవాటు పడి లక్షల రూపాయలు పోగొట్టుకొని చివరకు తమ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు.

ఐపిఎల్ మ్యాచ్‌ల పై పందేల జోరు

బిచ్కుంద లో జనం ఐపీఎల్ మ్యూచ్‌లను చూసేందుకు ఎగబడుతున్నారు. ప్రజల్లో ఆసక్తిని అనుకూలంగా మలుచుకొని కొన్ని ముఠాలు బెట్టింగ్ కు తెరతీశాయి. మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతి నిముషానికి. పందాలు కట్టించుకుంటున్నారు .బెట్టింగ్ వాళ్ల అట కట్టించేందుకు పోలీసులు శత విధాలా ప్రయత్నిస్తున్నా.. ప్రయోజనం లేకుండా పోతోంది. ముఖ్యంగా యువత బెట్టింగ్‌కు బానిసలుగా మారి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్ కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు లావాదేవీలు సాగిస్తుంటారు. వీరికి తోడు ఆటో డ్రైవర్లు. రోజువారీ కూలి పనులు చేసుకునేవారు సైతం పందేల మోజులో కొట్టుమిట్టాడుతున్నారు. మార్చి 22వ తేదీన ప్రారంభమైన ఐపిఎల్ మ్యాచ్‌లు మే నెల వరకు కొనసాగనున్న నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టంగా నిఘా పెట్టినా ఫలితం శూన్యంగా మారుతోంది. పందేల రూపంలో రూ . లక్షలు చేతులు మారుతున్నా చూస్తూ ఉండక తప్పని పరిస్థితి నెలకొంది.

హిడెన్ యాప్‌లే కీలకం

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లలో క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు ఉన్నాయి. వీటిలో రూ .10 నుంచి బెట్టింగ్ చేసే వెసులుబాటు ఉంది. ఇవి చాలా వరకు హిడెన్ మోడ్‌లోనే ఉంటాయి. పోలీసులు తనిఖీ చేసినా ఈ యాప్‌లు కనిపించవు. ఒకప్పుడు పెద్ద నగరాలకు మాత్రమే బెట్టింగ్ విధానం ఉండేది. బెట్టింగ్ ఫోన్ల పుణ్యమా అని అన్ని ప్రాంతాలకు విస్తరించింది.

జల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

– జిల్లా భూగర్భజల శాఖ అధికారి సతీష్ యాదవ్

కామారెడ్డి జిల్లా ప్రజాజ్యోతి ప్రతినిధి మార్చి 22. భూగర్భ జల శాఖ ,రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా లింగంపేట మండలం పోతాయిపల్లిలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. భూగర్భ జలాల నిర్వహణ , నియంత్రణ , స్థిరమైన అభివృద్ధిపై అవగాహన సదస్సు నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు క్రింద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి సతీష్ యాదవ్ మాట్లాడుతూ వర్షపు నీరు వృధాగా పోకుండా గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతలలోకి వర్షపు నీటిని మళ్ళించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో పర్క్యులేషన్ ట్యాంకులు , కాంటూరు కందకాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. చెరువులలో పూడిక మట్టి తీయడం వల్ల చెరువులో నీటినిలువ సామర్థ్యం పెరుగుతోందని సూచించారు. భూగర్భ జలాల యొక్క ప్రాముఖ్యత, వాల్టా చట్టం, భూగర్భ జలాల సంరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు.

తిప్పారం తాండ గ్రామపంచాయతీలో

అడవుల సంరక్షణ పై అవగాహన సదస్సు

గాంధారి మండలం (ప్రజా జ్యోతి) మార్చి 22 మండల కేంద్రంలోని తిప్పారం తాండా గ్రామపంచాయతీ పరిధిలో అడుగుల సంరక్షణ అడవి జంతువుల రక్షణ పై వ్యవసాయదారులకు బీట్ ఆఫీసర్ సుల్తానా తగు సూచనలు ఇచ్చారు. అడవులు పర్యావరణానికి ఊపిరితిత్తులుగా పిలుస్తారని అవి మనకు ఆక్సిజన్ మరియు వర్షాలు సమృద్ధిగా పడటానికి దోహదపడతాయని తెలిపారు. మనం ప్రధానంగా అడవుల పైనే ఆధారపడి జీవిస్తున్నాం కాబట్టి వాటి సంరక్షణ మన పైన చాలా ఉందని తెలిపారు. కనీసం ఉన్న అడుగులను నరకకుండా అడవిలో మంటలు పెట్టడం ద్వారా కీటకాలు జంతువులు చనిపోతాయని వాటిని సంరక్షించడం మన అందరి బాధ్యత అని సుల్తానా తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ బిషన్ లాల్, టీకా రామ్, న్యాల్ సింగ్, అనిల్ మరియు గోపాల్ పాల్గొన్నారు.

నూతన మండల అధ్యక్షులకు

శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద మార్చ్ 22 (ప్రజా జ్యోతి) కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో క్షేత్రస్థాయి లో కేడర్‌ను కాపాడుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులకు ఆదేశాలిచ్చారు. ఏ ఒక్క కార్యకర్త నష్టపోకూడదన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన మండల అధ్యక్షులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును మర్యాద పూర్వకంగా కలిసి, ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పలు సూచనలు, సలహాలిచ్చారు. నూతన మండల అధ్యక్షులుగా ఎన్నికైన వారు 1) రవీందర్ రెడ్డి (మహమ్మద్ నగర్ మండలం) 2) ఆలే మల్లికార్జున్ (నిజాంసాగర్ మండలం) 3) జే హన్మండ్లు (పిట్లం మండలం) 4) దర్పల్ గంగాధర్ (బిచ్కుంద మండలం) 5) మాలి పాటిల్ సంజయ్ కుమార్ (జుక్కల్ మండలం) 6) మహేందర్ రెడ్డి (పెద్ద కొడప్గల్ మండలం) 7) ధరస్ సాయిలు (మద్నూర్ మండలం) 8) బసవరాజ్ పటేల్ (డోంగ్లి మండలం)

కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నోటికి గుడ్డ కట్టుకొని నిరసన వ్యక్తం

మాచారెడ్డి ప్రజాజ్యోతి మార్చి 22. మండలం ఘనపూర్ (ఎం) అంబేద్కర్ విగ్రహం ముందు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ఇలియాస్ ఆదేశాల మేరకు కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షుడు ఐరేని సందీప్ సూచన మేరకు మాచారెడ్డి మండల కేంద్రాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల బట్ట కట్టుకొని, మోడీ బీజేపీ ప్రభుత్వం చర్యకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మాచారెడ్డి మండల అధ్యక్షుడు చల్లాపురం రాజురెడ్డి మాట్లాడుతూ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ మరియు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఐసిసి) యొక్క అన్ని సోషల్ మీడియా ఖాతాలను కేంద్ర ప్రభుత్వం స్తంభింపజేసారు. కనుక ఇది పూర్తిగా బీజేపీ పాలక ప్రభుత్వానికి చెందిన గుండా రాజ్యం చర్య ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలు అంత గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ఈ బిజెపి ప్రభుత్వ కుట్రపూరిత రాజకీయాలను వ్యతిరేకిస్తూ బిజెపిని గద్దె దించి కాంగ్రెస్ కు పట్టం కట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మండల యువజన అధ్యక్షులు చేల్లాపురం రాజిరెడ్డి మరియు ఎన్ ఎస్ యు ఐ మాచారెడ్డి అధ్యక్షులు నూతికాడి బద్రి ఘన్పూర్ గ్రామ యువజన అధ్యక్షులు సంతోష్, భూక్య రవి నాయక్, సుధాకర్, లక్ష్మణ్, అజయ్, సంతోష్ రెడ్డి, మంద సత్యం, సమీర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపదలో అసమానతలు నిలువరించాలి

– జేజేసీపీ బాబూరావు రీసెర్చ్ స్కాలర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ప్రజా జ్యోతి మార్చ్ 22 దేశంలో సంపదకు సంబంధించి ఆదాయ అసమానతలు అధికంగా ఉంటున్నాయి తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వాలు అవలంబించే పెట్టుబడిదారీ విధానాలు ధనవంతులను మరింత ధనవంతులుగాను, పేదలను మరింత పేదలుగాను మారుస్తున్నాయి అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. బలహీనమైన ప్రజాస్వామ్య సంస్థలు కొనసాగుతున్న కాలంలో సంపదలో ఈ అసమానతలు మరింత ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి అని చాలా స్పష్టంగా అవగతం అవుతుంది. సంపద యొక్క ఈ అంతరాలు సమాజంపై అసమాన ప్రభావాన్ని సులభతరం చేసే అవకాశాలు పొంచి ఉండడం విచారకరం. భారతదేశంలో ఆదాయం మరియు సంపద అసమానతలపై ది రైజ్ ఆఫ్ ది బిలియనీర్ రాజ్ (1922 - 2022) పేరుతో వరల్డ్ ఇన్ఈక్వాలిటీ ల్యాబ్ నివేదిక వెలుగులోకి తీసుకువచ్చింది. ప్రపంచ అసమానత ల్యాబ్ ప్రకారం భారతదేశానికి సంబంధించిన ఒక శతాబ్దం డేటా ఆదాయం మరియు సంపద అసమానత బ్రిటీష్ వలస పాలనలో కంటే దారుణంగా ఉంది అని స్పష్టం అవుతుంది. 'భారతదేశం యొక్క ఆధునిక బూర్జువా నేతృత్వంలోని బిలియనీర్ రాజ్ ఇప్పుడు వలసవాద శక్తుల నేతృత్వంలోని బ్రిటిష్ రాజ్ కంటే అసమానంగా ఉంది' అని అని వరల్డ్ ఇన్ఈక్వాలిటీ ల్యాబ్ తాజాగా ప్రచురించిన నివేదికలో వెల్లడించింది. నితిన్ కుమార్ భారతి, లూకస్ ఛాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి మొదలైన ఆర్థికవేత్తలు ఈ నివేదికను రూపొందించారు. 2022-23 నాటికి టాప్ 1 % ఆదాయం మరియు సంపద షేర్లు (22.6% మరియు 40.1%) వారి అత్యధిక చారిత్రక స్థాయిలలో ఉన్నాయి. భారతదేశం యొక్క టాప్ 1% ఆదాయ వాటా ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా, బ్రెజిల్ మరియు అమెరికా కంటే కూడా అత్యధికంగా ఉండడం గమనార్హం. సుమారు రూ.100 కోట్ల కంటే నికర సంపద ఎక్కువగా ఉన్న భారతీయులు 1991లో ఒక్కరు మాత్రమే ఉండగా 2022 నాటికి వారి సంఖ్య 162 కు పెరగడం గమనార్హం. 2014-15 మరియు 2022-23 మధ్య ముఖ్యంగా సంపద కేంద్రీకరణ పెరుగుదలలో అసమానతలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రకంగా దేశంలో ఆదాయ అసమానతలు అధికంగా ఉండడం తీవ్రంగా కలచివేస్తుంది.ప్రపంచ అసమానత ల్యాబ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం భారతదేశం యొక్క టాప్ 1 శాతం ఆదాయం మరియు సంపద వాటా ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. భారత జాతీయ ఆదాయంలో ఎక్కువ భాగం కేవలం అత్యంత సంపన్నులైన 1% జనాభా యొక్క ఆదాయం మరియు సంపద వాటాలు 1961 తర్వాత ఈ స్థాయిలో ఉండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. 2022-23లో టాప్ 1 శాతం సంపద వాటా 39.5 శాతం, 29 శాతం పాయింట్లు కేవలం టాప్ 0.1 శాతానికి, 22 శాతం పాయింట్లు కేవలం టాప్ 0.01 శాతానికి మరియు 16 శాతం పాయింట్లు కేవలం టాప్ 0.001 శాతానికి చేరాయి. ఈ రకంగా సంపద టాప్ 1 శాతంలో కూడా ఎక్కువగా కేంద్రీకృతమై ఉండడాన్ని సునిశితంగా గమనించవచ్చు. భారతదేశంలో ఆదాయ మరియు సంపద అసమానతలను నిశితంగా పరిశీలించాలి' అని ఈ నివేదిక పేర్కొనడాన్ని సునిశితంగా గమనించవచ్చు. బడా వ్యాపారవేత్తలు, ప్రభుత్వం మధ్య సంబంధాలు పెరిగిపోవడం మరియు ప్రజల మౌలిక అంశాలలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవడం తద్వారా సమాజంలో అంతరాలు మరింతగా చోటుచేసుకోవడాన్ని సూచిస్తుంది అని చెప్పవచ్చు. ప్రభుత్వ పెట్టుబడులు సగటు భారతీయుల కోసమే ఉండాలి తప్పించి సంపన్నుల కోసం కేటాయింపులు ఉండకూడదు అని ఈ నివేదిక సృష్టపరచడం గమనార్హం. సంపద కొద్ది మంది చేతుల్లో ఉండడం అనేది అసమ సమాజానికి సంకేతంగా నిలుస్తుంది. ఇకనైననూ ప్రభుత్వాలు పెట్టుబడిదారీ విధానాలకు పెద్దపీట వేయడాన్ని తగ్గిస్తూ మధ్య తరగతి మరియు సామాన్య ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించి వారి జీవన పరిస్థితులను మెరుగుపరిచి అంతిమంగా సంపదలో అసమానతలు నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంటి పన్నులను

తప్పనిసరిగా చెల్లించాలి

టాక్సును వసూలు చేస్తున్న అధికారులు

రెంజల్ ప్రజా జ్యోతి మార్చ్ 22 : గ్రామాలలోని ఇంటి పన్నులను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూళ్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమ నిర్వహించారు. ఇంటి పనులను చెల్లించినట్లయితే గ్రామ అభివృద్ధికి ఆర్థికంగా దోదపడతాయన్నారు. స్పెషల్ డ్రైవ్ లో ఇంటి పనులను వసూలు చేయగా 18 వేల421 రూపాయల వరకు వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు శ్రీకాంత్, రాజు, సునీల్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్, కారోబార్ శంకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపు పై దాడి.. బాటిళ్లు స్వాధీనం

రెంజల్ ప్రజా జ్యోతి మార్చ్ 22 : అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యం బెల్టుషాపులపై దాడి చేసినట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఆయన కథనం మేరకు రెంజల్ మండల కేంద్రంలోని కిరాణా షాపులో ఎటువంటి అనుమతులు లేకుండా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న దానిపై దాడి చేసి మద్యం బాటిలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు బెల్ట్ షాప్ పై దాడి చేయగా 18 బాటిలను స్వాధీనం చేసుకొని, నగదు 4422 రూపాయలను నాలుగు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కొండ శేఖర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా మద్యాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఎస్సైని సన్మానించిన హనుమాన్ స్వాములు

రుద్రూర్, మార్చ్ 22 (ప్రజా జ్యోతి) : రుద్రూర్ మండల పరిధిలో పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై జి. అప్పారావును శుక్రవారం హనుమాన్ స్వాములు శాలువ, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైను సన్మానించిన వారిలో మల్లేష్ (గురుస్వామి), దమ్మ సాయు స్వామి, తెల్ల రవిస్వామి, గోపి స్వామి, ఉప్పు రవిస్వామి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శ

గాంధారి మండలం (ప్రజా జ్యోతి) మార్చి 22 మండల కేంద్రంలోని గండివేట్ తండా కి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రమావత్ చందా నిన్న బైక్ ఆక్సిడెంట్ లో మరణించగా నేడు ఆ గ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి మా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అలాగే గండిపేట్ గ్రామంలో పెద్దాపురం రాజు ఇటీవల కరెంట్ షాక్ తో మరణించగా వారి కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే మదన్మోహన్రావు పరామర్శించారు.

ఉపాధ్యాయుడిపై పాక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట మార్చి 22 (ప్రజా జ్యోతి) మండలంలో జప్తి జానకంపల్లి ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలపై అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ప్రవీణ్ లైంగిక వేధింపులు గురి చేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.స్థానిక ఎస్సై రాజు తెలిపారు వివరాల ప్రకారం జప్తి జానకంపల్లి గ్రామంలో గురువారం షీ టీం సభ్యులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కార్యక్రమం పై అవగాహన నిర్వహిస్తుండగా విద్యార్థుల ఈ సంఘటన గురించి షీ టీం సభ్యులకు తెలిపారు దింతో ఎల్లారెడ్డి డిఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి ఉపాధ్యాయునిపై ఫోక్స్, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.